క్లుప్తంగా

ఆరోగ్య సంరక్షణలో ఆశాలే కీలకం



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కుష్ఠు, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్

ఐరాల: గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆశావర్కర్లే కీలకమని జిల్లా కుష్ఠు, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. కుష్ఠు, టీబీ కేసులకు సంబంధించిన రికార్డులను, ల్యాబ్ రికార్డులను, గళ్ల పరీక్షల రికార్డులను పరిశీలించారు. ఆశాడే సందర్భంగా ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో కుష్ఠు, టీబీ వ్యాధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ మందిర్‌లో పలు రికార్డులను పరిశీలించి, వైద్య పరికరాలను ఎలా ఉపయోగించాలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత, డీపీఎంఓలు మణి, జాన్, పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎల్‌డీసీ ఉమాపతి, ల్యాబ్ టెక్నీషియన్ అజార్, ఫార్మసిస్ట్ జయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మొగిలి ఘాట్‌లో వరుస ప్రమాదాలు



మొగిలి ఘాట్‌లో ప్రమాదానికి గురైన కంటైనర్ వాహనం

బంగారుపాళెం:మండలంలోని మొగిలి ఘాట్ దొరచెరువు వద్ద మంగళవారం ఉదయం ప్రమాదం చోటు చేసుకుంది. కంటైనర్ వాహనం బ్రేక్ ఫెయిల్ కావడంతో ముందు వెళ్తున్న మరో కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ గాయపడ్డాడు. పలమనేరు నుంచి చిత్తూరు పోతున్న కంటైనర్ వాహనం మార్గమధ్యంలో మొగిలి ఘాట్‌లో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ముందు వెళ్తున్న మరో కంటైనర్ వాహనాన్ని ఢీకొట్టి రహదారి పక్కకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ సోహిత్‌ఖాన్ గాయపడ్డాడు. అతడిని 108లో బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం ఇదే ప్రాంతంలో మూడు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు గాయపడటం విదితమే. రెండు రోజులు వరుస ప్రమాదాలు చోటుచేసుకోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

టీకాలు సకాలంలో వేయాలి



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: పిల్లలకు టీకాలు సకాలంలో వేయాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. మంగళవారం ఆశావర్కర్లకు స్థానిక పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, విటమిన్–ఏ సిరపను పిల్లలకు తొమ్మిదవ నెలలో మొదటిసారి ఇవ్వాలని, అలాగే ఐదేళ్లు వచ్చే వరకు వారికి ప్రతి ఆరునెలలకోకసారి ఇస్తూ ఉండాలన్నారు. గర్భవతులుగా ఉన్న వారిని 12 వారాల్లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి వారం గ్రామాల్లో వేస్తున్న టీకాల గురించి వివరించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లేటప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు ముఖ్యం



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సాగరిక

తవణంపల్లె: మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బంగారుపాళ్యం ఉద్యానశాఖ అధికారి సాగరిక కోరారు. మండలంలోని ఈచనేరి, మడవనేరిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి సాగరిక మాట్లాడారు. మామిడిలో పూత దశలో ఎలాంటి మందులు స్ప్రే చేయాలో రైతులకు తెలియజేశారు. రైతాంగానికి సంబంధించి వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. తవణంపల్లె వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ మాట్లాడుతూ వరి పంటలో నత్రజని ఎరువులు తగ్గించాలని సూచించారు. ఆఖరి దుక్కిలో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులతోపాటు రెండుసార్లు యూరియా, పొటాష్ వాడాలన్నారు. కార్యక్రమంలో ఈచనేరి సర్పంచ్ ఉమామహేశ్వర రెడ్డి, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొంపముంచుతున్న డిజిటల్ పే



- గుడిపాలకు చెందిన ఓ యువకుడి ఖాతాలో చిన్న మొత్తంలో నగదు అకస్మాత్తుగా మాయమైంది. ఫోన్‌పేలో చూస్తే బ్యాలెన్స్ '0' చూపిస్తోంది. దీంతో దిక్కుతోచక ఆ యువకుడు గుడిపాలలోని బ్యాంకును ఆశ్రయించాడు. తన ఖాతాల్లో నగదు ఉన్నట్టుండి ఖాళీ అయిందని.. మళ్లీ నగదు వేసినా అది కూడా కనపడలేదని మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. బ్యాంక్ ఖాతాను పరిశీలించిన సిబ్బంది... మీ ఖాతాను సైబర్ క్రైమ్ వారు బ్లాక్‌లో పెట్టారు. నగదు ఖాతాలో ఉంది. కానీ చూపించదని సమాధానం ఇచ్చారు. ఆ యువకుడు ఏం చేయాలో తెలియక వెనుతిరిగి వచ్చాడు.

- గుడిపాలకు చెందిన మరో వ్యక్తి తన ఖాతాలో రూ.2,000 ఉండడంతో ఓ దుకాణానికి వెళ్లి వస్తువులు కొనుగోలు చేశాడు. డబ్బు చెల్లించేందుకు ఫోన్ పే చేయబోతే ఖాతాలో నగదు లేదని చూపించింది. దీంతో బ్యాలెన్స్ పరిశీలించగా ఉన్న రూ.2000 కనిపించకపోగా .. ఇంకో రూ.2,220 మైనస్‌లో ఉన్నట్లు చూపించింది. ఆందోళనకు గురైన యువకుడు బ్యాంక్‌లో విచారించినా ఫలితం లేకపోయింది.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి (ఫైల్)

- సైబర్ ఉచ్చులోపడి విలవిల
- అకస్మాత్తుగా ఖాతాల్లో నగదు ఖాళీ
- లబోదిబోమంటున్న బాధితులు
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

గుడిపాల : స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏదికొన్నా.. ఏం తీసుకున్నా .. ఏం అమ్మినా డబ్బు రూపకంగా కాకుండా ఫోన్‌పే, గూగుల్ పే వాడుతున్నారు. ఇది ఒకరకంగా ఉపయోగమే అయినప్పటికీ చాలా వరకు ప్రమాదమని బ్యాంకర్లు చెబుతున్నారు. కొంత మంది ఫోన్‌లలో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారు. గెలుపొందిన వారికి నేరుగా ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నారు. కానీ ఆ డబ్బు ఏ బ్యాంక్ నుంచి ఏ ఖాతా నుంచి వస్తుందో తెలియడం లేదు. ఇలా తమ ఖాతా నంబర్లు ఆన్‌లైన్‌లో ఉపయోగించడం వల్ల మోసాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయి. చాలా వరకు వ్యవసాయ , కూలీ పనులు చేసుకొనే వారే సైబర్ మోసాలకు బలవుతున్నారు. చిన్న మొత్తంలో నగదు పోతే ఏదో ఒకటి రెండు రోజులు బాధపడి వదిలేస్తారు. రూ.లక్షల్లో మోసం చేస్తే ఎలా అంటూ బాధితులు ఆవేదన చెందుతున్నారు. జాగ్రత్తగా ఉండాలని పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చాలావరకు సైబర్ నేరగాళ్లకు గురికాకుండా ఉండండి.. ఏ లింక్ పడితే అది నొక్కక్కండి.. ఓటీపీలు చెప్పొద్దని కాలర్ టూన్‌లు కూడా వస్తున్నాయి.

మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు

- సెల్‌ఫోన్‌లకు వచ్చే లింకులు క్లిక్ చేయకుండా జాగ్రత్తగా గమనించి తెరవాలి.
- గుర్తు తెలియని వ్యక్తులకు ఆధార్ నంబర్లు, ఓటీపీలు, ఖాతా వివరాలు చెప్పొద్దు.
- యూపీఐ ద్వారా చెల్లించే బ్యాంక్ ఖాతాల్లో తక్కువగా డబ్బు ఉండేలా చూసుకోవాలి.
- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తామని చెప్పే వారి మాటలు, ప్రకటనలు నమ్మొద్దు.
- గుర్తు తెలియని వ్యక్తుల కాల్, మెసేజ్‌లకు స్పందించకుండా మీ ప్రమేయం లేకుండా ఫోన్‌లో ఏదైనా యాప్ డౌన్‌లోడ్ అయిందా లేదా చూసుకోవాలి. ఫోన్ వాడకుండానే చార్జింగ్ తగ్గిందంటే అనుమానించాల్సిందే.
- ఎవరైనా లాటరీ తగిలిందని, లేదా ఆఫర్‌లో వస్తువులు తక్కువ ధరలకు వచ్చాయి.. మీకు ఇన్సూరెన్స్ నగదు వేస్తామని చెప్పే వారి మాటలు నమ్మవద్దు.
- అలాంటి ఫోన్‌లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

అవగాహన కల్పిస్తున్నాం

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని చాలా మంది డబ్బులు పోగొట్టుకుంటున్నారు. సైబర్ నేరగాళ్లతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. ఎవరు పడితే వాళ్లకు ఓటీపీలు చెప్పవద్దు. ఆధార్ కార్డులు ఇవ్వరాదు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. మండల వ్యాప్తంగా సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నాం.ప్రజలు మోసపోకుండా అవగాహన కల్పిస్తున్నాం.

– రామ్మోహన్, ఎస్ఐ, గుడిపాల

ఆది దేవా నమస్తుభ్యం.!



-గరుడ వాహనంలో విహరిస్తున్న వేంకటేశ్వరస్వామి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మనం కంటితో చూడగలిగేది సూర్యుడిని మాత్రమే. అందుకే సూర్యుడిని ప్రత్యక్ష దైవమని పిలుస్తారు. రథసప్తమి రోజు ప్రత్యేకంగా సూర్యుడికి పూజ చేస్తారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ సప్తమిని రథసప్తమిగా నిర్వహించడం పరిపాటి. ఈ రథ సప్తమి వేడుకలను మంగళవారం చిత్తూరు నగరంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈశ్వర గుడివీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేక పూజలు చేశారు. తోమాల సేవ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గరుడ సేవలో ఊరేగించారు. కట్టమంచిలోని వరదరాజులస్వామి ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు పలు సేవల్లో ఊరేగారు. సూర్యప్రభ, గరుడ వాహనం, హనుమంత వాహనం, శేష వాహనం, అశ్వ వాహనం, పుణ్యకోటి వాహనం, చంద్రప్రభ వాహనం విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం ఏకాంత సేవలో సేదదీరారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మిశ్రా కమిషన్‌ను రద్దు చేయాలి

- రూ.60వేల కోట్లు అప్పు తెచ్చి అమరావతిలోనే ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శ



గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ వర్గీకరణపై చంద్రబాబు నాయుడు నియమించిన మిశ్రా ఏక సభ్య కమిషన్‌ను రద్దు చేయాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, బ్యాంకుల రుణాల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఏడున్నర శాతం, ఓబీసీలకు 27 శాతం రుణాలు ఇవ్వాలన్నారు. వేలాది కోట్లు అప్పులు తీసుకుని ఎగనామం పెట్టే కార్పొరేట్ సంస్థలకే మళ్లీ రుణాలు మంజూరు చేయడం తప్పితే విద్యార్థులు, రైతులకు ఇచ్చిన పాపానపోవడం లేదని దుయ్యబట్టారు. వేల కోట్ల రుణం మాఫీ చేయించుకున్న ఓ వ్యక్తి మళ్లీ పదివేల కోట్లు కావాలని పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి దరఖాస్తు పెట్టుకుంటే అతడికి మోదీ ప్రభుత్వం సాగిలపడుతోందని ఆరోపించారు. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. 60 వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చి, ఒక్క అమరావతిలోనే ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. చిత్తూరు నగర అభివృద్ధికి వెంటనే 1000 కోట్ల రూపాయలు మంజూరు చేయాలన్నారు. ధర్నాలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, పెనుమూరు శంకరయ్య, బ్రాహ్మణపల్లి భరత్ కుమార్, కొరవకట్టి వేణు, నీరుగట్టు భువనేశ్వరి, నీరుగట్టు పార్వతి, పెనుమూరు ఎర్రయ్య, కలికిరి కృష్ణయ్య, మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ అక్బర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు యూరియా కష్టాలు



మండుటెండలో క్యూలో నిలబడి ఉన్న రైతన్నలు



బంగారుపాళెంలో ...

ఐరాల: కూటమి ప్రభుత్వ పాలనలో యూరియా కోసం అన్నదాతలకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. మంగళవారం మండలంలోని వైఎస్ గేటులో ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం ఎరువుల దుకాణంలో అందుబాటులో ఉన్న యూరియా కోసం రైతన్నలు గంటల తరబడి ఎండలో క్యూలో పడిగాపులు కాశారు. ఇక్కడ యూరియా ఉందని తెలియడంతో మండలంలోని పలువురు రైతులు పోలోమంటూ వచ్చారు. ఆధార్ కార్డుకు ఒక బస్తా చొప్పున విక్రయించారు. దుకాణానికి 30 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. యూరియా బస్తా రూ.270 విక్రయించారు. మండలంలో 18 రైతు సేవా కేంద్రాల్లో ఇప్పటి వరకు ఎరువులు సరఫరా చేయకపోవడంతో వైఎస్ గేటులో అన్నదాతలు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో పడిగాపులు పడి యూరియా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి పాలనలో తమకు కష్టాలు మరింత ఎక్కువయ్యాయని రైతులు వాపోయారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం:అన్నదాతలకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మంగళవారం స్థానిక మన గ్రోమోర్ దుకాణంలో యూరియా విక్రయాలు నిర్వహించారు. మండలంలోని నలుమూలల నుంచి వచ్చిన రైతులు దుకాణం తెరవక ముందే క్యూలో నిల్చుని పడిగాపులు కాశారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తారో, లేదో? అని రైతులు తెల్లవారక ముందే ఇక్కడికి చేరుకుని తిప్పలుపడి యూరియా బస్తాలు కొనుగోలు చేసి తీసుకువెళ్లారు. రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీపై సంబంధిత వ్యవసాయాధికారులు సరైన సమాధానం చెప్పడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ఇచ్చే ఒక బస్తా యూరియా కోసం ఎండలో పడిగాపులు పడాల్సి వస్తోందని వాపోయారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గుడిపాల: మండలంలో అక్రమంగా తరలిస్తున్న తమిళనాడు రేషన్ బియ్యాన్ని ఆటోతో సహా స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం.. గుడియాత్తంకు చెందిన అయ్యప్పన్(36) తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి 850 కేజీల రేషన్ బియ్యాన్ని మంగళవారం సాయంత్రం ఆటోలో తరలిస్తుండగా బండపల్లె క్రాస్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్కడైనా అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిసినట్లయితే వెంటనే తమకు సమాచారమ ఇవ్వాలని ఎస్ఐ కోరారు.



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

సామాజిక తనిఖీ ప్రజావేదిక

– ఉపాధి సిబ్బంది నుంచి రూ.26,796 రికవరీ



పనుల వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీ శోభారాణి

తవణంపల్లె: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డ్వామా పీడీ రవికుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. పంచాయతీల్లో జరిగిన పనులను డీఆర్‌పీలు క్షేత్ర స్థాయిలో ఆడిట్ చేసి ప్రజా వేదికలో వెల్లడించారు. డ్వామా పీడీ రవికుమార్ మండలంలోని 32 పంచాయతీలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేసిన పనుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఆర్‌పీలు ఇచ్చిన నివేదిక, ఆరోపణలను ఆలకించారు. 2023 నుంచి 2024 వరకు మండలంలో చేసిన 14,019 రూ. 8,72,52,541ఉపాధి నిధులను ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. కూలీలకు వేతనాలు కింద రూ.6,36,06,337, మెటీరియల్ కింద 2,36,36,204 వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఉపాధి పనుల్లో గోవిందరెడ్డిపల్లె, చెర్లోపల్లెలో ట్రెంచ్‌లను పూడ్చివేశారని ఆరోపణలు రావడంతో ఉపాధి సిబ్బంది నుంచి రూ.26,796 రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవీఓ శివయ్య, క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం, ఎంపీడీఓ రెడ్డిబాబు, ఎస్ఆర్పీ మల్లికార్జున, ఎస్టీం లోకేశ్వరరెడ్డి, ఏపీఓ లలిత, అధికారులు, రైతులు, వేతనదారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు, షూస్ పంపిణీ



క్రీడా దుస్తులు ధరించిన విద్యార్థులు

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాస్కెట్ బాల్ నేర్చుకుంటున్న 120 మంది విద్యార్థులకు ముంబైకి చెందిన ఐస్ యూత్ ఫౌండేషన్ ప్రతినిధులు ఉచితంగా క్రీడా దుస్తులు, షూలు అందజేశారు. మేనేజర్ జయసూర్య, కోచ్ సలీం, ఫిజికల్ డైరెక్టర్లు ఝాన్సీ, గిరిజ పాల్గొన్నారు.

గుండ్లపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'

ఐరాల: పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఆమె మాట్లాడారు. ఆకుకూరలు క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు తీసుకుంటే రక్తహీనత సమస్య బారిన పడరన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఐరాల: గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు

గుడిపాల: ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ పేర్కొన్నారు. మంగళవారం గుడిపాలలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్స చేసి నెలకు అవసరమయ్యే మందులను అందజేశారు. మంచానపడ్డ రోగుల ఇంటివద్దకు వెళ్లి వైద్యం చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సోనియా, చంద్ర, సింధుజ పాల్గొన్నారు.

వాహనాలకు భారీ జరిమానా

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని ఇరువారం, వేలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం రవాణాశాఖ అధికారులు వాహనాల తనిఖీలు చేశారు. వాహన పన్ను చెల్లింపులు, రికార్డులను క్షుణంగా చూశారు. పన్ను చెల్లించని 9 వాహనాలకు భారీ మొత్తంలో జరిమానా విధించినట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION),CHITTOOR. I.P. No. 03 of 2025

Between:
S. Salma W/o Feroz Khan, residing at D.No. 7-117, Chavidi street, Chittoor ... Petitioner
And:
S.Vijaya & 4 Others..Respondents

NOTICE TO THE RESPONDENT Nos.1 to 5

1.S.Vijaya W/o Abbas, residing at D.No. 14-217, Khadermeeran Street, Chittoor.
2. D. Haseem S/o Dastgiri Saheb, residing at D.No. 19-250, Mittoor, Chittoor.
3. K.Drakshayani W/o Varadarajulu, Residing at New Balaji Colony, Near RTC Depot, Chittoor.
4.M. Manjuvani, W/o Late Kumar, (vani beauty parlour), Ajitha House, Ramnagar Colony, Chittoor
5. S. Dilshad W/o Sadiq,residing at D.No.26-79, B-2 Cross, Division No.32,Ram Nagar Colony,Chittoor

Madams, Please take notice that the above I.P. filed by the Petitioner against the Respondents, declaring the Petitioner as an insolvent and the same is posted to 10.03.2025 for your notice. Please be present on the said date through anAdvocate and to raise your objections if any, failing which the matter will be decided in your absence as exparte.

Hearing date: 10.03.2025
(BY ORDER OF THE HON'BLE COURT)

V.UDAYASANKAR,
Advocates for Petitioner,Chittoor

మందు కొట్టి డ్రైవింగ్ చేస్తే ఇంతే..!

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా చేసిన వాహనాల తనిఖీలో పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 27 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరిచారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



గుడిపాల: క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



చిత్తూరు రూరల్(కాణిపాకం): ర్యాలీ చేస్తున్న వైద్య బృందం

గుడిపాల: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం గుడిపాలలో వైద్య సిబ్బంది ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సంధ్య మాట్లాడుతూ, పొగాకు తయారీ ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్ వస్తుందన్నారు. పురుషులు తంబాకు, గుట్కా, సిగరెట్, బీడీలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఇక, మహిళల్లో అధికంగా రొమ్ము, థైరాయిడ్, గర్భాశయ, అండాశయ క్యాన్సర్లు వస్తున్నాయని, 40 ఏళ్లు దాటిన మహిళలు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవడం శ్రేయస్కరమన్నారు. ఒకవేళ క్యాన్సర్ ప్రాథమిక దశలో ఉన్నట్లు నిర్ధారణ అయితే దీనిని నుంచి సరైన చికిత్సతో పూర్తిగా బైటపడవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ శోభారాణి, హెల్త్ సూపర్వైజర్ విజయ, సిబ్బంది చంద్రశేఖర్, జబసెల్వి, తేజు పాల్గొన్నారు.

మురకంబట్టులో ..

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరులోని మురకంబట్టులో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఆశ స్థానికులకు క్యాన్సర్, క్యాన్సర్‌కు దారితీసే పరిస్థితులు, క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సుమతి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తవణంపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న అపోలో నర్సిగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అప్రమత్తంగా ఉండాలి

తవణంపల్లె: క్యాన్సర్ వ్యాధి విషయంలో అప్రమత్తంగా ఉండాలని అరగొండ అపోలో హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ రమణ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.